క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మలికిపురం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ మద్దూరి సతీష్ బుధవారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ పీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. మలికిపురం, విశ్వేశ్వరాయపురం, వీవీ మెరక, మోరి, కేశవదాసుపాలెం, గొంది, అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెం, అడ్డాలపాలెం, అప్పనరామునిలంక, మోరిపోడు గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

విజేతలకు బహుమతులు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

ముగ్గుల పోటీల్లో ప్రతిభ

ఆలమూరు: అమలాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మండలానికి చెందిన వివిధ గ్రామాల మహిళా పోలీసులు ప్రతిభ కనబర్చారు. ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం-2 గ్రామ సచివాలయాలకు చెందిన మహిళా పోలీసులు వేసిన ముగ్గులు ప్రత్యేకతను చాటుకున్నాయి. ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి, ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ చేతుల మీదుగా వారు బహుమతులు అందుకున్నారు.

పొన్నాడ సేవలు చిరస్మరణీయం

రాజోలు: స్థానిక తాలూకా వేదశాస్త్ర పరిషత్‌కు సీనియర్ న్యాయవాది పొన్నాడ హనుమంతరావు అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి సోమేశ్వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీగౌతమి పుష్కర వేద పాఠశాల వద్ద హనుమంతరావు సంతాప సభ నిర్వహించారు. హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు పాపయ్యపంతులు, వెంపరాల కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆరుమిల్లి సూర్యప్రకాశరావు, కార్యదర్శి హోతా విజయ్‌కుమార్, ధరణీప్రగడ వంశీకృష్ణ, ఐ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పి.గన్నవరం: స్థానిక బాలయోగి కాలనీలో సీఐ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. 13 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.81,960 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై పి.గంగాభవాని తెలిపారు.

ఐక్యంగా సాగాలి

పి.గన్నవరం: సమస్యల పరిష్కారానికి టెంట్ హౌస్ యజమానులంతా ఐక్యంగా సాగాలని జిల్లా యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. పి.గన్నవరంలో బుధవారం మండల యూనియన్ అధ్యక్షుడు అడబాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. మండల ఉపాధ్యక్షుడు కుసుమ నాగేశ్వరరావు, కోశాధికారి బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

అయినవిల్లి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని డీఆర్సీ ఏడీఏ రాజశేఖర్ అన్నారు. బుధవారం నేదునూరు పంచాయతీ పరిధిలో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విశిష్టతను వివరించారు. ఏడీఓ షంషీ తదితరులు ఉన్నారు.

వాసవీ క్లబ్ ప్రమాణ స్వీకారం

ఆలమూరు: స్థానిక వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్-వనితా క్వీన్ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వెత్సా లక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక జనార్దనస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాత సుదర్శన్, పాస్ట్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నాగు కాశీ విశ్వేశ్వరరావు హాజరయ్యారు. అధ్యక్షులుగా యలమర్తి సంతోషి, జనరల్ సెక్రటరీగా మిర్తిపాటి గంగారావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లుగా కంచర్ల స్వాతి, వెత్సా సునంద, జోన్ చైర్మన్లుగా నార్కెడిమిల్లి వెంకట సుబ్బారావు, వెత్సా సౌజన్య ప్రమాణ స్వీకారం చేశారు.

బీజేపీ నేతల నిరసన

సఖినేటిపల్లి: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకానికి సంబంధించిన విషయంలో ప్రధాని మోదీ ఫొటో రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శించలేదంటూ బుధవారం బీజేపీ శ్రేణులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ కార్యాలయంలో వినత పత్రం అందజేశారు. నాయకులు మాలే శ్రీనివాస నగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధిగా రాము

అంబాజీపేట: టీడీపీ అమలాపురం పార్లమెంట్ సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధిగా స్థానిక కొర్లపాటివారిపాలేనికి చెందిన రవణం రాము నియమితులయ్యారు. ఆయన్ని పలువురు అభినందించారు.


కొత్తపేట డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను తిలకిస్తున్న శిల్పి రాజ్‌కుమార్


ఇసుకపూడిలో విద్యార్థినులు వేసిన రంగవల్లులు చూస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధ్యాయులు


పి.గన్నవరం ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ప్రభను ఊరేగిస్తున్న విద్యార్థులు

సంక్రాంతి.. ఆనంద సవ్వడి

- ముందే పండగ సంబరాలు
- భోగి మంటలు, సంప్రదాయ వేషధారణలతో సందడి


మామిడికుదురులో భోగి మంట చుట్టూ కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

కొత్తపేట: ఎగసే మంటలు.. చీకటిని చీల్చే కాంతులు.. మోముపై కాంతి రేఖలు.. పిల్లాపాపలతో కేరింతలు.. పిండి వంటల ఘుమఘుమలు.. బంధువుల ఆప్యాయతలు.. తెలుగువారి అనుబంధాల పరవళ్లు సంక్రాంతి సంబరాలు. అలాంటి పెద్ద పండగ ముందే వచ్చింది.. ఈ పండగ ముందస్తు సంబరాలను వివిధ ప్రాంతాల్లో జరుపుకొన్నారు. కొత్తపేటలోని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.అరుణ్‌కుమార్, కళాశాల ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ టి.రమాదేవి పర్యవేక్షణలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ హాజరై మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. బాలికలు వివిధ రకాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. భోగి మంట వేసి దాని చుట్టూ విద్యార్థులు, అధ్యాపకులు నృత్యం చేశారు. స్థానిక కాంతిభారతి విద్యా సంస్థల ప్రాంగణంలో డైరెక్టర్ డి.సత్యవాణి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. కోడిపందేలకు సూచికగా బాలురు కోడిపుంజులతో స్టిల్స్ ఇచ్చారు.

మామిడికుదురు: సంప్రదాయ హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, గొబ్బెమ్మలు, విద్యార్థుల కోలాహలం, బొమ్మల కొలువు నడుమ ముందస్తు సంక్రాంతి సంబరాలను మామిడికుదురు దీప్తి విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు.

అంబాజీపేట: సంక్రాంతి పండగ తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌లు అన్నారు. ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేసి, ప్రభలను మోస్తూ అలరించారు. హైస్కూల్ ప్రాంగణంలో భోగి మంటను వేసి సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పీఎంసీ చైర్మన్ భీమరాజు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. భోగి మంటలు వేసి, సంక్రాంతి ప్రభను ఊరేగించారు.


విశ్వేశ్వరాయపురంలో సంక్రాంతి వేడుకల్లో విద్యార్థుల సందడి

మలికిపురం: విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. హరిదాసు, సోదెమ్మ, డూడూ బసవన్న వేషధారణలు ఆకట్టుకున్నాయి. భోగి మంటలు వేశారు. ప్రిన్సిపాల్ పీవీ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆలమూరు: మండల ప్రైవేట్ స్కూల్ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక బ్లూబెల్స్ కాన్వెంట్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హరిదాసు, భరతమాత, డూడూ బసవన్న వివిధ దేవతామూర్తుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రతిష్టాత్మకంగా నక్షత్ర నవగ్రహ యాగం

మామిడికుదురు: విలసవిల్లిలో ఈ నెల 22వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకూ నక్షత్ర నవగ్రహ పూర్వక మహా సౌరయాగం షష్ఠమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని నిర్వాహకుడు మన్నంగి రామకృష్ణశర్మ అన్నారు. దీనికి రావాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు ఆయన ఆహ్వానపత్రం అందించారు. రామకృష్ణశర్మ మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించే ఈ యాగానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, వైఎస్సార్ సీపీ నేతలు సలాది సతీష్, అడ్డగళ్ల వెంకటసాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చిట్టిబాబుకు ఆహ్వానపత్రం అందిస్తున్న నిర్వాహకుడు రామకృష్ణశర్మ

సప్తాహ మహోత్సవం ప్రారంభం

పెదపట్నంలో మూలేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ వార్ల ఆలయాల సన్నిధిలో బుధవారం నుంచి 18వ సప్తాహ మహోత్సవం ప్రారంభమైంది. ఇది 18వ తేదీ వరకూ జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది. ఉదయం 4.45 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవాలకు కలశ స్థాపన చేశారు. ఏడు రోజుల పాటు నిరంతరాయంగా శ్రీరామ నామ సర్వనామ కీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహిస్తారు.

కోకో గింజలను వేరు చేద్దామిలా..

అంబాజీపేట: ప్రస్తుతం రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా రైతులకు తమ వంతు సాయం చేయాలనే ఆలోచన ఆ యువకులకు వచ్చింది. గంగలకుర్రుకు చెందిన ఊటాల గణపతిరావు పదో తరగతి చదివి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నన్నయ విశ్వవిద్యాలయంలో గిడ్ల పల్లంరాజు ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్నాడు. వీరు ఇద్దరూ ఖాళీ సమయంలో అభ్యుదయ రైతు చిట్టావఝుల బాబూరావు వద్ద సహాయకులుగా ఉంటున్నారు. బాబూరావుకు ఏదో రకంగా నూతన యంత్ర పరికరంతో ఉపయోగపడాలనే ఆలోచన పల్లంరాజు, గణపతిలకు వచ్చింది. దీంతో బాబూరావుతో చర్చించి రూ.3,500 వెచ్చించి రెండు అడుగుల ఎత్తు ఉండేలా కింద నుంచి 9 అంగుళాల ఎత్తులో ఇనుప చిక్కం మెష్‌తో ఒక తొట్టిని తయారు చేయించారు.


కాఫీ గింజలను యంత్ర పరికరంలో వేసి తొక్కుతున్న పల్లంరాజు, గణపతి

పక్వానికి వచ్చిన కోకో కాయలను కోసి గుజ్జును తొట్టిలో వేసి కాళ్లతో తొక్కితే గింజలు కిందకు సులువుగా వచ్చేలా గణపతిరావు, పల్లంరాజు తయారుచేశారు. దీనిని గంగలకుర్రులో ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ పరికరం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభినందించారు.

సాయం చేసి.. స్ఫూర్తిగా నిలిచి..

కొత్తపేట: పేగు, లివర్ వ్యాధితో బాధపడుతున్న అలం త్రిమూర్తులు వైద్యానికి స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని వలంటీర్లు రూ.20,500 సాయం అందించారు. స్థానిక సచివాలయం- 3 వలంటీర్ మంగాదేవి తండ్రి త్రిమూర్తులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను పేగు, లివర్ ఇన్ఫెక్షన్‌తో సుమారు మూడు నెలల నుంచి బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగా సుమారు రూ.4 లక్షల ఖర్చయ్యింది. చివరికి మంగళగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందాడు. రోజుకు రూ.వేలల్లో ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా త్రిమూర్తులు అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న వలంటీర్లు రూ.20,500 సేకరించి బుధవారం పంచాయతీ కార్యదర్శి వీవీ రామన్ చేతుల మీదుగా అందజేశారు. పథకాలు ప్రజలకు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు సేవల్లోనూ ముందు ఉండడంపై పలువురు అభినందించారు.


త్రిమూర్తులు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కార్యదర్శి రామన్

అలనాటి జ్ఞాపకం.. పదిలం


దిండిలో కలుసుకున్న 1986-89 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో 1986-89 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు ఒకచోట కలుసుకుని సందడి చేశారు. వీరు బుధవారం దిండి పర్యాటక కేంద్రంలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం దిండి వశిష్ట నదిలో వారంతా బోటు షికారు చేశారు. కలసి భోజనాలు చేశారు. తమ కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుని గ్రూపు ఫొటోలు దిగారు. ఎస్.బాబ్జీ, జి.శ్రీరామ్, కడలి వెంకటరత్నం, దేవ రాజేంద్రప్రసాద్, బేబీ పద్మకుమారి, ఆర్.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

అంబాజీపేట: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం పుల్లేటికుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలను అమలు చేయడంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. భవిష్యత్‌లో జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో డ్రైన్లు, రహదారులు నిర్మించాలని, ఇళ్ల పట్టాలు, హౌసింగ్ రుణాలు, పింఛన్లు ఇప్పించాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. త్వరలోనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై బ్రోచర్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, నందుల ఆదినారాయణ, వాసంశెట్టి చినబాబు, నాగాబత్తుల శ్రీనివాస్, దంగేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

సమాజ సేవలో 'చిర్ల యూత్ ఫోర్స్'

కొత్తపేట: రావులపాలెం మండలానికి చెందిన కొందరు యువకులు 'చిర్ల యూత్ ఫోర్స్' (సీవైఎఫ్) పేరుతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అభిమానులైన యువకులు ఆయన పేరిట సీవైఎఫ్ స్థాపించి కొన్నేళ్లుగా పేదలకు సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా మెడికల్ క్యాంపులు, విద్యార్థుల మానసిక వికాసం కోసం మోటివేషన్ తరగతుల నిర్వహణ, క్రీడాకారులకు ప్రోత్సాహక కార్యక్రమాలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి సహకారం, స్వచ్ఛభారత్ వంటివి నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో బాధితులకు నిత్యావసర సరకులు, మందుల కిట్లు సరఫరా, అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం, రక్తదాన శిబిరాలు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువజన సంఘాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా సాయం చేస్తున్న సీవైఎఫ్ సభ్యులు (ఫైల్)

అంతర్వేదిలో ప్రత్యేక పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయంలో బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయం వద్ద అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం దేవస్థానం డీసీ ఎం.విజయరాజు స్వామివారి చిత్రపటాన్ని మంత్రి వేణుకు అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు తదితరులు ఉన్నారు. ఇదిలాఉంటే అంతర్వేది పుణ్యక్షేత్రంలోని పురవీధులను కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి పరిశీలించారు. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే తీర్థ మహోత్సవాలకు భద్రతా పరంగా రూపొందించిన మ్యాప్‌ను చూశారు. పుణ్యక్షేత్రంలో రహదారులు, రథం వెళ్లే మార్గంలో వారు నడిచి వెళ్లి మరీ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్వామివారిని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటం అందజేశారు.


అంతర్వేది ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

పనులు వేగవంతం చేయండి

అయినవిల్లి: కొండుకుదురు, క్రాప, శంకరాయగూడెం మీదుగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం పరిశీలించారు. ఈ పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు. ఈ రహదారి నిర్మాణంతో మూడు గ్రామాల ప్రజల సమస్యలు తీరతాయన్నారు.


రహదారి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

ఆయన వెంట సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల రామకృష్ణ, కుడుపూడి రామకృష్ణ, నాయకులు యడ్ల కిరణ్‌బాబు, బయ్యా చినబాబు తదితరులు ఉన్నారు. అనంతరం కొండుకుదురు మెర్సీ ప్రేయర్స్ హౌస్ చర్చిను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రాపలోని ఓ చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల తొత్తరమూడిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మద్దాల సుబ్బారావు తల్లి మృతి చెందగా ఆయన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శించారు.

తెగుళ్లను తట్టుకునే వంగడాలను పండించాలి


ఇరుసుమండలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నరసింహారావు

అంబాజీపేట: దాళ్వాలో తెగుళ్లను తట్టుకునే ఎంటీయూ 1121 రకాన్ని పండించాలని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త పీవీ నరసింహారావు, ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇరుసుమండలో వీఏఏ ఎస్.కిరణ్‌దుర్గ అధ్యక్షతన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి చిరు సంచులతో (మినీ కిట్) కొత్త రకం ఎంటీయూ 1341 పరిశోధనలో ఉందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా రైతులు ఆలోచన చేయాలన్నారు. పురుగు, ఎరువుల మందులను విచక్షణా రహితంగా వాడవద్దన్నారు. రైతులు మోకాటి నాగేశ్వరరావు, పిల్లా వెంకటరత్నం, మామిడిశెట్టి బలరామకృష్ణ, నాగాబత్తుల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి

ఆలమూరు: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో క్షయ వ్యాధి నిర్మూలనకు అంతా కృషి చేయాలని జిల్లా వైద్యాధికార బృందం సభ్యులు డాక్టర్ సుజాత సౌమ్య, సతీష్ అన్నారు. పెనికేరులో బుధవారం పర్యటించి క్షయ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్య సాయాన్ని వారు పరిశీలించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వనుం చిన్నావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2025 చివరి నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. సూపర్‌వైజర్ పీవీ రమణారావు, ఏఎన్ఎంలు టి.సుశీల, కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైవీ పాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పి.గన్నవరం: బెల్లంపూడి గ్రామ సచివాలయం పరిధిలోని యర్రంశెట్టివారిపాలెంలో గురువారం ఉదయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐక్యంగా ముందుకు సాగాలి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: హక్కుల సాధనకు ఉపాధ్యాయులు ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పెద్దవీధిలో నాగమల్లి చెట్టు వద్ద యూటీఎఫ్ మండల మహాసభ మండల శాఖ అధ్యక్షుడు పి.ఏడుకొండలు అధ్యక్షతన బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సభలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, యూటీఎఫ్ నాయకులు గుబ్బల రాంబాబు, పెంకే వెంకటేశ్వరరావు, మురళీ, కె.సురేష్, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పి.గన్నవరం: ముంగండ చింతామణి గణపతి మందిరంలో శ్రీత్యాగరాజ ఆరాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న సంగీత జగద్గురు శ్రీత్యాగరాజ స్వామివారి 47వ ఆరాధనోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఉదయం త్యాగరాజ స్వామి, శ్రీరామచంద్రమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. పిన్నింటి అన్నపూర్ణ బృందంచే శ్రీత్యాగరాజ పంచరత్న కీర్తన సేవ నిర్వహించారు. రాత్రి వి.తులసీ విశ్వనాథ్, పెరవలి ఆనందకుమార్, జయభాస్కర్‌లచే గాత్ర సంగీత సభ జరిగింది. కార్యక్రమాలకు త్యాగరాజ ఆరాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఖండవిల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి నడిమింటి నాగరాజారావు, పెన్నింటి రామచంద్రశాస్త్రి, ముక్కామల వెంకట శాస్త్రి, గొడవర్తి హేమలత, పి.వెంకటకృష్ణ తదితరులు ఆధ్వర్యం వహించారు.